క్లుప్తంగా

క్రమశిక్షణతో క్రీడలు నేర్చుకోవాలి

అంబాజీపేట: క్రీడాకారులు ఏ క్రీడలైనా క్రమశిక్షణతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో నేర్చుకుంటే విజయానికి దోహదపడతాయని స్థానిక నాయకులు కొర్లపాటి గోపి, కొర్లపాటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణను ఆదివారం వారు సందర్శించారు. ఇటీవల న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు పి.భూషణం, బి.కుప్పిర్, పి.భార్గవి శ్రీకళ పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం



భవానీకి ఆర్థిక సాయం అందిస్తున్న తాడి సత్యనారాయణ

మలికిపురం: అడవిపాలెం గ్రామానికి చెందిన తాడి భవాని ఇంటి నిర్మాణానికి తాడి వారి సంక్షేమ సంఘం సమకూర్చిన రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని సంఘం తరఫున ఆదివారం అందించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఆర్థికంగా సహాయం చేసిన తాడి శ్రీనివాస్‌కు, తాడి రత్నరాజు, తాడి సువర్ణరాజు, గంటా విద్యాసాగర్‌కు సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమం లో వ్యవస్థాపక అధ్యక్షుడు తాడి మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మహాలక్ష్మికి సన్మానం



మహాలక్ష్మిని సన్మానిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

మామిడికుదురు: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన మొగలికుదురు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొల్లాబత్తుల మహాలక్ష్మిని రాష్ట్ర ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం ఘనంగా సత్కరించింది. 586 మార్కులు సాధించి మండలంలోనే మొదటి స్థానంలో నిలిచిందని అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షులు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు తెలిపారు. ఎంతో కష్టపడి చదువుకుని మంచి ప్రతిభ చూపిందని మహాలక్ష్మిని అభినందించారు. ఆమెకు శాలువా కప్పి, అంబేడ్కర్ చిత్రపటం బహుకరించారు. ఆమె తండ్రి కొల్లాబత్తుల మధువాసన్, తల్లి కనకదుర్గను కూడా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గౌరవాధ్యక్షుడు పెయ్యల వీరభద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యలపై ఎమ్మెల్యే పరిశీలన



అప్పనరాముని లంక పంచాయతీ వద్ద సమావేశంలో ఎమ్మెల్యే దేవ

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంకలో సమస్యలపై ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అధికారులతో కలసి పరిశీలించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో రోడ్లు అభివృద్ధి, విద్యుత్ సమస్యలు, తాగునీటి సరఫరా తదితర వాటిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఇదిలా ఉండగా టేకిశెట్టిపాలెం, అప్పనరాముని లంక గ్రామాల మధ్య గోదావరి పాయపై నిర్మించిన వంతెన అప్రోచ్ రోడ్డు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దంతాలను పరిరక్షించుకోవాలి

పి.గన్నవరం: ప్రతి ఒక్కరూ తమ దంతాలను ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని దంత వైద్య నిపుణుడు నాగాబత్తుల అశోక్ సూచించారు. స్థానిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తోలేటి సుబ్బారావు అధ్యక్షతన ఆదివారం జరిగిన క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దంతాల పరిరక్షణకు పలు సూచనలిచ్చారు. సమావేశంలో వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు శ్రీఘాకోళ్లపు లక్ష్మీపతిరావు, ప్రధాన కార్యదర్శి కడలి పార్థసారథి, నేలపూడి రామకృష్ణ, పాటోలు సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, కె.నరసింహం, నాగేశ్వరరావు, రావూరి సత్యనారాయణ, పి.పరశురాముడు, వి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణమందిరంలో విశేష పూజలు

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో మందిర నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు చేశారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ వేద శాస్త్రాలను ప్రామాణికంగా తీసుకుని భగవంతుని కీర్తించాలన్నారు. ఏది ప్రామాణికమో అదే ఆది దేవుని ప్రతీకరమన్నారు. చాలా మంది దొంగ బాబాల బురిడీలను గుర్తించలేక మాయలో పడుతున్నారన్నారు. ఇది భక్తులు అర్థం చేసుకున్నప్పుడే అసలైన దేవుడిని పూజిస్తారన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు భారీ అన్నప్రసాద వితరణ చేశారు.

మండే ఎండ.. జాగ్రత్తలే అండ

- ఉపాధి వేతనదారులపై ప్రభావం
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

కొత్తపేట: ప్రస్తుతం భానుడు భగభగమండుతున్నాడు. గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో రోజూ ఉపాధి హామీ పథకం పనికి, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారికి వడదెబ్బ ప్రమాదం పొంచి ఉంది. అయితే ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులు, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లవలసి వస్తే వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుత వేసవిలో ఉపాధి పనులు ఎక్కువగా చేపట్టారు. ఉపాధి పనిచేస్తున్న సమయంలో శరీరంలో ఎటువంటి మార్పులు కనిపించినా తక్షణమే సురక్షితమైన చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. నిర్ణీత వేళలు దాటి ఉపాధి పనులు చేయకపోవడం ఎంతో మంచిదని సూచిస్తున్నారు. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 91,288 మంది కూలీలు ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్నారు.

- ఎండలు తీవ్రంగా ఉన్నపుడు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు పని చేయడం మానుకోవాలి. ఉదయం, సాయంత్రం ఎండ తీవ్రం కాకుండా పనులు ముగించుకోవాలి.
- పని ప్రదేశాల్లో శరీరం అలసటగా మారి నీరసం, వాంతులు, ఇతరత్రా మార్పులు కనిపిస్తే తక్షణమే విశ్రాంతి తీసుకుని వైద్యులను సంప్రదించాలి.
- ఎండలు తీవ్రంగా ఉన్నపుడు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, వృద్ధులు ఉపాధి పనులకు వెళ్లకపోవడం శ్రేయస్కరం.



కొత్తపేట మండలం పలివెలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులంతా తగినంత నీరు తీసుకోవాలి. శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వకుండా ఓఆర్ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయ నీరు తాగాలి.

జగ్గిరెడ్డికి ఘన సత్కారం



గోపాలపురంలో జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరిస్తున్న మండల కన్వీనర్లు

ఆలమూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి ఘన సత్కారం జరిగింది. నియోజకవర్గంలోని ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ కన్వీనర్లు తమ్మన శ్రీనివాసు, దొమ్మేటి అర్జునరావు, ముత్యాల వీరభద్రరావు ఆదివారం మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నివాసమైన గోపాలపురం విచ్చేశారు. ఈసందర్భంగా దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీని జిల్లా వ్యాప్తంగా పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అందరూ అహర్నిశలు శ్రమిద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి వ్యాఖ్యానించారు.

వైభవంగా లక్ష గులాబీల పుష్పార్చన



లూటుకుర్రులో పళ్లాలమ్మకు నిర్వహించిన లక్ష గులాబీల అర్చన

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలోని బోనం వారి మెరకలో కొలువైన గ్రామ దేవత శ్రీపళ్లాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి సన్నిధిలో ఆదివారం పలు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. మహిళలతో సామూహిక అష్టోత్తర శత కలశ పూజ, సామూహిక కుంకుమార్చన, వివిధ పుష్ప, ఫలార్చనలు, లక్ష గులాబీలతో పుష్పార్చన, విశేష మహా నివేదన కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. ఈదరాడకు చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ పర్యవేక్షణలో వేద పండితులతో గణపతి, మహాకాళీ, లక్ష్మీ, సరస్వతి, ఆదిమూల శాంతి హోమాలు, పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పం, పండిత సత్కారం తదితర కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. విశేష సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట స్థానిక సర్పంచ్ అడబాల తాతకాపు, బోణం బాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సన్ స్ట్రోక్



కె.పెదపూడిలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అంబాజీపేట: భానుడు భగభగమండుతున్నాడు. పగటి పూటతో పాటు రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో ఉదయం నుంచే వడగాడ్పులు వీయడం ప్రారంభమవుతున్నాయి. రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరగడంతో వేడి సెగలు కక్కుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటూ తన ప్రతాపాన్ని చూపించడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడిపోతున్నారు. వేడి గాలులకు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయానికి ప్రజలు ఇళ్లకే పరిమితం అవ్వడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పగటి పూట తమ పనుల నిమిత్తం గ్రామాల్లో తిరిగే ప్రజలు, పొలం పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు మండుతున్న ఎండలు చూసి భయాందోళనతో బయటకు రాలేకపోతున్నారు. ఉక్కబోతతో వృద్ధులు, చిన్న పిల్లలు మరింత అల్లాడిపోతున్నారు. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే రోహిణీకార్తెలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

తాగునీటి సమస్యలపై గ్రామ పర్యటన



రామరాజులంకలో తాగునీటి సమస్యలపై గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న మండలంలోని రామరాజులంకలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం పర్యటించారు. అధికారులుతో కలసి గ్రామ సమస్యలపై సమీక్షించారు.

ప్రాథమిక పాఠశాల దగ్గర ఉన్న వాటర్ ట్యాంకును పరిశీలించారు. వాటర్ ట్యాంకు బేస్మెంట్ దెబ్బతిందని గ్రామస్తులు తెలిపారు. ఆ పనులు త్వరలో పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం రామరాజులంక బాడవ రోడ్డు పరిశీలించారు. రోడ్డు సరిగా లేక చాలా ఇబ్బంది పడుతున్నామని వర్షాకాలం వస్తే పిల్లలు చాలా అవస్థలు పడుతున్నారని ప్రజలు వాపోయారు. నీరు, కరెంట్ సమస్యలు ఉన్నాయని మహిళలు ఎమ్మెల్యేకి తెలిపారు. ప్రజల సమక్షంలోనే సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తదుపరి పంచాయతీ భవనంలో జరిగిన సమావేశంలో శాసనసభ్యులు, స్థానిక ఎన్డీఏ నాయకులు, గ్రామ ప్రజలతో సమస్యలపై సమీక్షించారు. అనంతరం ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మరణించిన పున్నం నాగమావుళ్ళు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ కాకర శ్రీనివాస్, ముద్దల శ్రీను, దేవ దయానంద్, ముద్దల ప్రభాకరావు, తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 18 మంది, లక్ష్మీగణపతి హోమంలో 25 జంటలు, స్వామివారి పంచామృతాభిషేకాల్లో ఒక జంట, స్వామివారి స్వామివారి గరిక పూజలో ఇరువురు జంటలు పాల్గొన్నారు. ఇరువురికి తులాభారం, ఒకరికి నామకరణ చేశారు. అన్నప్రాశన ఐదుగురు చిన్నారులకు నిర్వహించారు. స్వామికి 4 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆరు నూతన వాహనదారులు పూజలు చేయించుకున్నారు. 2700 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,64,385లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని మండలంలోని ఊడిమూడిలో ఆదివారం స్థానిక అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఊడిమూడి సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి అమలాపురం ఎంపీ జి.హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, గిడ్డి రాంబాబు, అయినపర్తి ఇందిరా ప్రియదర్శిణి, గిడ్డి బ్రహ్మయ్య, నక్కా సునీల్ రాజు, పులపర్తి పండు, నేలపూడి నానీ, కడిమి బన్నీ, పందిరి పూర్ణచంద్రరావు, కోటే సూర్యారావు, గిడ్డి పాల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మలికిపురం : మండలంలోని గూడపల్లిలో వేంచేసిన నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి గూడపల్లి గ్రామస్తులు గోకవరపు సేవదారులు గోకవరపు సత్యనారాయణ మూర్తి, సూర్యకాంతం జ్ఞాపకార్థం కుటుంబ కుమారులు, మనుమలు రూ.50,116 విరాళంగా అందించారు. దాతలకునూకాలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ధన్యవాదాలు తెలిపింది.

నాగబాబుకు పురస్కారాల వెల్లువ



విజయవాడలో అవార్డులు అందుకుంటున్న నాగబాబు

అంబాజీపేట: గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా నిర్వహిస్తున్న గరగ నృత్య వీర నాట్య బృంద నాయకుడు, ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబుకు ఆదివారం పురస్కారాలు వెల్లువలా లభించాయి. ఇందుకు సంబంధించి ఆదివారం విజయవాడలోని గాంధీనగర్‌లో ఉన్న హోటల్ అలంకార్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో విశాఖపట్నంకు చెందిన మూడు స్వచ్ఛంద సేవా సంస్థలు నాగబాబుకు పురస్కారాలు ప్రదానం చేశాయి. విశాఖపట్నంలోని అల్లిపురానికి చెందిన మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గురుబ్రహ్మ సేవారత్న అవార్డును ప్రదానం చేసింది. అల్లిపురంలోని జెండా చెట్టు వీధిలో ఉన్న ప్రతిభ సాంస్కృతిక క్రీడా స్వచ్ఛంద సేవా సంస్థ ఆణిముత్యం ఉగాది జీవిత సాఫల్య పురస్కారాన్ని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి అందజేశారు. అల్లిపురానికే చెందిన గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ నాగబాబుకు కళాజ్యోతి నేషనల్ అవార్డు 2025 ప్రదానం చేశారు.

వైభవంగా రావులమ్మ జాతర



సంధిపూడిలో రావులమ్మ అమ్మవారు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి శివాలయం వరకూ నృత్య కళాకారులు చేపట్టిన గవ్వ నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గవ్వ నృత్య కళాకారుడికి కోళ్లను నైవేద్యంగా అందించి గ్రామస్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. గ్రామం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తమ తమ చంటిపిల్లలతో కాగడాలు వెలిగించి కావడి కోళ్లు సమర్పించారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలోని కూడలి వద్ద నెలకొన్న అప్పాయమ్మను భక్తులు దర్శించుకుని నైవేద్యాలను సమర్పించారు. గ్రామంలో శనివారం రాత్రి శ్రీరావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



విరాళం అందిస్తున్న దాతలు

అయినవిల్లి: యువత అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. అయినవిల్లిలంకలో ఆదివారం అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో వీరు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అన్నారు. అంబేడ్కర్ చిత్రపటంతో అయినవిల్లిలంక నుంచి ముక్తేశ్వరం సెంటర్ వరకూ భారీ ఊరేగింపు జరిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్ద మండల, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

జోరుగా వరి కోతలు



కె.పెదపూడిలో కోత యంత్రాలతో వరి మాసూళ్లు

అంబాజీపేట: మండలంలో వరికోతలు జోరందుకున్నాయి. ముందుగా ఊడ్చిన చేలు, తక్కువ కాలం పంటరకాలు కోతకు చేరుకోవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు. మండలంలో అంబాజీపేట, మాచవరం, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, వక్కలంక, ఇరుసుమండ, ముక్కామల, పుల్లేటికుర్రు, పసుపల్లి, చిరతపూడి, ఇసుకపూడిలో కోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ సారి వరి కోతలకు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. గతేడాది మండలంలో 60 శాతం వరి కోతల్లో యంత్రాలను వినియోగించగా, ఈ సారి 90 శాతం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాలకు మాత్రమే వ్యవసాయ కూలీలు పరిమితమవుతున్నారు. యంత్రాల ద్వారా ఎకరానికి రూ.2500 ఖర్చవుతుండగా కూలీలు, కోత కోయడానికి రూ.1500, తిరిగి పనలు కట్టి, మాసూలు చేయడానికి రూ.3 నుంచి రూ.4 వేలు అడుగుతుండడంతో అధిక శాతం రైతులు వరి యంత్రాల వైపే మొగ్గుచూపుతున్నారు. నేలతడి ఆరని ప్రాంతాల్లో తప్పని పరిస్థితుల్లో కూలీలను వినియోగిస్తున్నారు. మండలంలో 2998 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకు 300 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు



చొప్పెల్లలో శిబిరం నిర్వహించిన వైద్యులను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు జరిగింది. కమ్యునిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) సంయుక్త భాగస్వామ్యంతో స్థానిక మహాలక్ష్మీ ఆలయం సమీపంలోని ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ దంగేటి చంద్రకళ ప్రారంభించారు. రాజమహేంద్రవరంలోని సుభద్ర హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ఆకుల దుర్గాప్రసాద్, డాక్టర్ పద్మిని వచ్చి సుమారు 200 మందికి వైద్య సేవలందించారు. ఈవైద్య శిబిరంలో ఉచితంగా ఎముకల సాంద్రత, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కోనసీమ జిల్లా పీఎంపీ అధ్యక్షుడు కోన సత్యనారాయణ, మండలశాఖ కన్వీనర్ ఏడిద లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో వైద్యులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. తూర్పుగోదావరి జిల్లా పీఎంపీ అధ్యక్షులు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళ శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గొల్లాలమ్మ జాతర, తీర్థం

కె.గంగవరం: మండలంలోని అముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి జాతర సందర్భంగా బుట్టబొమ్మలు, గారడీలు, బ్యాండుమేళాలు, కోయడ్యాన్సులు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతర అనంతరం ఆదివారం ఆలయాల వద్ద తీర్థం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోదండరాముడికి వెండి, బంగారు ఆభరణాల సమర్పణ



వెండి, బంగారు ఆభరణ అలంకరణలో కోదండరాముడు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు గొల్లగుంట కొప్పిశెట్టివారిపాలెంలో వేంచేసిన కోదండరామస్వామికి భక్తుల సమకూర్చిన వెండి బంగారు ఆభరణాలను సమర్పించారు. కొప్పిశెట్టివారిపాలెం, సానబోయినవారిపాలెం గ్రామ ఆడపడుచులు వెండి కిరీటాన్ని సమర్పించారు. అలాగే గ్రామానికి చెందిన కొప్పిశెట్టి ఆనంద రామారావు జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు వెండి నేత్రాలను నామాలను, బంగారు ముక్కుపుడక స్వామివారికి అందజేశారు. అంతకుముందు ఆలయ చైర్మన్ కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రసాద్‌కు ఘన సన్మానం



పలివెలలో కొమారిపాటి ప్రసాద్‌ను సత్కరిస్తున్న శిల్పి రాజ్‌కుమార్

కొత్తపేట: గరగ నృత్యం, వీరనాట్యంలో కొమారిపాటి ఏసువెంకటప్రసాద్ ప్రతిభను చాటుతూ ఆయా కళలకు జాతీయ స్థాయిలో వన్నె తెచ్చారని ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ అన్నారు. ప్రసాద్ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం తీసుకున్న సందర్భంగా ఆదివారం మండలంలోని పలివెల కళాకారుల సంఘ భవనంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల కళాస్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారులు అభినందన సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో శిల్పి రాజ్‌కుమార్‌వుడయార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రదర్శనలు ఇచ్చిన సుమారు 55 కళారూపాల్లో ఏసువెంకటప్రసాద్ ఆధ్వర్యంలోని గరగనృత్యం, వీరనాట్యం బృందాలు పాల్గొనడమే కాక ఈ నెల 6, 7 తేదీల్లో దేశ వ్యాప్త కళారూపాల నుంచి 100 మంది కళాకారులతో డాక్యుమెంటరీ ప్రోగ్రాంలో రాష్ట్రం నుంచి గరగ నృత్యం కళాకారుడిగా కూడా పాల్గొన్న ఘనత ప్రసాద్‌కు దక్కిందన్నారు. అనంతరం కళాకారుల తరఫున రాజ్‌కుమార్ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల కళారూపాల సంఘాల అధ్యక్షులు కొరివి సత్తిబాబు, ఇలపర్తి శ్రీనివాసరావు, ఆయా సంఘాల సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం (మండపేట): ప్రైవేటు పాఠశాల్లో నిరుపేద విద్యార్థులకు ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండపేట ఎంఈఓలు రామచంద్రరావు, సోమిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ద్వారా నేటి నుంచి మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 16 నుంచి విద్యార్థులకు పాఠశాలలను లాటరీ ద్వారా కేటాయిస్తారని ఎంఈఓలు తెలిపారు.